

ఐకేపీలో బదిలీలు అయ్యేనా!

బదిలీల కోసం ఐకేపీ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 215 మంది ఐకేపీలో పని చేస్తున్నారు.

- 8లో ▸



బడ్జెట్‌తో జీవితాలపై ప్రభావం

ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే బడ్జెట్‌లతో ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవితాలు ప్రభావితం అవుతాయని తెయూ రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /24.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా డాక్టర్ బద్దం రాజశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. చార్మినార్ జోన్‌కు డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న ఆమె జిల్లాకు బదిలీపై వస్తున్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

నిజామాబాద్ నాగారం: జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించాలని డీఎండబ్ల్యూవో రసూల్‌బీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు అయ్యేలా, అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలపై వివరించనున్నారు.

3న అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నాగారంలోని రాజారాం స్టేడియంలో జావెలిన్ డే సందర్భంగా రాష్ట్రస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -12, 14, 16, 18, 20 విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన 20 మందిని ఈ నెల 7న రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేస్తామని తెలిఆపారు. 2న సాయంత్రం ఐదు గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989040776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాక్లూర్ సొసైటీలో రైతుల ఆందోళన

మాక్లూర్: రుణమాఫీ రాకుండా చేశారని ఆరోపిస్తూ బుధవారం మాక్లూర్ సొసైటీ ప్రాంగణంలో సుమారు 100 మంది రైతులు సొసైటీ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. తాము 2023 సెప్టెంబర్, నవంబర్ నెలలో రుణం తీసుకోగా రికార్డుల్లో మాత్రం డిసెంబర్ 13 తరువాత తీసుకున్నట్లు పొందుపరిచారని మండిపడ్డారు. అప్పటి పాలకవర్గం చేసిన తప్పిదంతో పూర్తిగా నష్టపోయామంటూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు.



ఇందూరు నయాగరా..

చుట్టూ దట్టమైన అడవి.. మధ్యలో చెరువు.. 40 అడుగుల ఎత్తునుంచి నీళ్లు జారువారుతూ...జలపాతాన్ని తలపిస్తోంది ఇందల్వాయి మండలం సిర్నాపల్లి శివారులోని శీలం జానకీబాయి చెరువు.. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నుంచి అలుగు పారుతోంది. నాలుగేళ్లుగా ఈ ప్రకృతి రమణీయ దృశ్యం వేలాది మంది ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే మరో రెండు నెలలపాటు అలుగు పొంగే అవకాశం ఉంది. గ్రామం నుంచి జలపాతం వరకు రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఇందల్వాయి/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఆర్మూర్ డివిజన్‌లో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: విద్యుత్‌శాఖ ఆర్మూర్ డివిజన్‌లో ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం సమయంలో పైఅధికారులు ఫోన్ చేస్తే రెండు గంటల పాటు స్పందించకపోవడంతో పెర్కిట్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరిని మే 9న డీఈ సస్పెండ్ చేశారు. దీనిపై 'ఆర్మూర్ డివిజన్‌లో ఇదేమి లెక్క!' శీర్షికన సాక్షి దిన పత్రికలో జూలై 9న కథనం ప్రచురితమైంది. దీంతో వరంగల్ నుంచి విజిలెన్సు డీఈ సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆర్మూర్ డివిజన్, పెర్కిట్ సెక్షన్‌లో విచారణ చేపట్టారు. సస్పెండ్ చేయడానికి గల కారణాలను ఆరా తీసినట్లు తెలిసింది. రెండు గంటల తర్వాత లైన్‌ఇన్‌స్పెక్టర్ మరమ్మతులు చేసినట్లు రికార్డులో ఉంది. అయినా సస్పెండ్ చేయడంపై వివరాలు సేకరించినట్లు సమాచారం.

తెయూలో కొత్త వివాదం

ప్రభుత్వం యూనివర్సిటీల పాలకమండళ్ల నియామకాల ప్రక్రియ చేపట్టింది. కాగా తెలంగాణ వర్సిటీ నుంచి రిజిస్ట్రార్ వివాదాస్పద 2014 నియామక అభ్యర్థులకు చోటు కల్పిస్తూ జాబితా పంపడం చర్చనీయాంశమైంది. తెయూలో పరిస్థితులను చక్కదిద్దడంలో గత పాలకమండలి తిరుగులేని పాత్ర పోషించింది. ప్రొఫెసర్ యాదగిరిని గత ఈసీ సభ్యులే రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన గత పాలకమండలి నిర్ణయాలను ఒక్కటికూడా అమలు చేయకపోవడం గమనార్హం.

- ఇంటర్నల్ ఈసీ సభ్యుల నియామకంలో ఇష్టారాజ్యం
- నియోజకవర్గ ఎమ్మెల్యేకు తెలియకుండా గోప్యత పాటించిన రిజిస్ట్రార్?
- గత పాలకమండలి నిర్ణయాల్లో ఒక్కటీ అమలుపర్చని వైనం
- వర్సిటీలో అనేక అవకతవకలను చక్కదిద్దిన గత పాలకమండలి సభ్యులు
- పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చే విధంగా వ్యవహారాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: గత మూడేళ్ల కాలంలో అనేక వివాదాస్పద, అసంబద్ధమైన నిర్ణయాలకు తోడు పలు అక్రమాలు, అవినీతి వ్యవహారాల నేపథ్యంలో.. తెలంగాణ యూనివర్సిటీలో పరిస్థితులను చక్కదిద్దడంలో గత పాలకమండలి తిరుగులేని పాత్ర పోషించింది. అప్పటి వీసీ రవీందర్‌గుప్తా, ఆయన నియమించిన రిజిస్ట్రార్లు పాల్పడిన అవకతవకలను ఎప్పటికప్పుడు పాలకమండలి సభ్యులు ఎండగట్టారు. దీంతో కొంతమేర వర్సిటీ పరిస్థితులు చక్కపడ్డాయి. ప్రొఫెసర్ యాదగిరిని పాలకమండలి సభ్యులు రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే రిజిస్ట్రార్ యాదగిరి పాలకమండలి నిర్ణయాలను ఒక్కటి కూడా అమలు చేయకుండా వ్యవహరించడం గమనార్హం. ఈ క్రమంలో గత పాలకమండలి కాలపరిమితి ముగిసింది. అక్రమాల్లో వీసీ రవీందర్ గుప్తా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అవినీతి, అక్రమాలను వెలుగులోకి తేవడంలో వరుస కథనాలతో 'సాక్షి' కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం రెగ్యులర్ వీసీకి బదులు సీనియర్ ఐఏఎస్‌లను ఇన్‌చార్జి వీసీలుగా నియమిస్తూ వస్తోంది. దీంతో అంతా రిజిస్ట్రారే అన్నవిధంగా తయారైంది. తాజాగా తెలంగాణ యూనివర్సిటీకి కొత్త పాలకమండలి (ఈసీ) సభ్యుల నియామక ప్రక్రియతో మరో కొత్త వివాదం తెరపైకి వస్తోంది.

■ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పది యూనివర్సిటీల్లో వైస్ చాన్స్‌లర్లు, పాలకమండళ్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియ చేపట్టింది. కాగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంటర్నల్ ఈసీ సభ్యుల నియామకంలో ప్రస్తుత రిజిస్ట్రార్ వివాదాస్పద 2014 నియామక అభ్యర్థులకు చోటు కల్పిస్తూ జాబితా పంపడం వివాదాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల వీసీ పదవికి దరఖాస్తు చేసుకున్న ఓ మైనారిటీ అభ్యర్థికి కాల్ వచ్చినట్లు సమాచారం. సదరు అభ్యర్థి వీసీ పదవికి చేసుకున్న దరఖాస్తులో దాదాపు 300 పైగా పేటెంట్స్ ఉన్నాయని, మరో 200 పైగా ప్రాజెక్టులు చేసినట్లు సమాచారం. సదరు దరఖాస్తును పరిశీలించిన ఉన్నత విద్యామండలి అధికారులు అవాక్కై సామాజిక శాస్త్రం, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అసాధ్యమైన ఈ అంశంపై ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా విచారణ చేయించినట్లు వర్సిటీ సీనియర్ ఆచార్యులు ఒకరు తెలిపారు.

గత పాలకమండలి సభ్యుల గడువు 2024 ఫిబ్రవరి 28తో ముగిసింది. దీంతో నూతన ఈసీ ఏర్పాటుకు అభ్యర్థుల జాబితా కోరుతూ వర్సిటీ రిజిస్ట్రార్, స్థానిక ఎమ్మెల్యేకు ప్రభుత్వం నుంచి లేఖ అందింది. ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచిన రిజిస్ట్రార్ ఎమ్మెల్యే జోక్యం ఉండకుండా చేసేందుకు హైదరాబాద్ వెళ్లి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రిని, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి జాబితా అందించారు. ఆ జాబితాలో వివాదాస్పద 2014 అభ్యర్థులు ఉండడం గమనార్హం. యూని

ఆది నుంచీ హైడ్రామానే?

వర్సిటీ తరఫున ప్రిన్సిపల్‌తో పాటు ముగ్గురు సభ్యులు ఉండే ఈసీలో ఇద్దరు, ముగ్గురు వివాదాస్పదమైన 2014 నియామక అభ్యర్థులు ఉండేలా రిజిస్ట్రార్ చక్రం తిప్పడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. వారం రోజుల క్రితం ఆయా అభ్యర్థుల వివరాలను పోలీసు విభాగం, జీఏడీ సేకరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా 2014లో నియామకమైన అభ్యర్థులు సమావేశమై ఎలాగైనా సదరు నియామకాలకు ఆమోదముద్ర వేయించుకుంటామనే ధీమాతో ఉన్నారు. గతంలో రవీందర్ గుప్తా వీసీగా ఉన్న సమయంలో, అంశం కోర్టులో ఉన్నప్పటికీ వీరందరికీ అక్రమంగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించారు. అందుకు గాను పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారని వర్సిటీలో చర్చ జరిగింది. ఆ లోపే ఆయన అవినీతి కేసులో అరెస్ట్ అయ్యారు. కాగా ప్రస్తుతం ఇంటర్నల్ ఈసీ సభ్యుల నియామక వ్యవహారం సరికొత్త వివాదానికి తెర తీసినట్లయింది. మరి ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో చూడాల్సిందే!

అందని రుణమాఫీ!

మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన వడ్నాల కిషన్‌కు గ్రామంలోని ఎస్‌బీఐలో పంట రుణం వడ్డీ అసలు కలిపి రూ.1.49లక్షల వరకు ఉంది. రెండో విడ త మాఫీ జాబితాలో అని పేరు లేదు. దీంతో వ్యవసాయ అధికారులను సంప్రదించగా కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉంది అని రిమార్క్ కాలంలో కనిపించింది. ఆయన గల్ఫ్ వెళ్లిన సమయంలో రేషన్ కార్డు నుంచి పేరు తొలగించడంతో కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

వేల్పూర్ మండలం అంక్సాపూర్‌కు చెందిన దేగాం సాయమ్మకు తొలి జాబితాలో రుణం మాఫీ జరగాల్సి ఉంది. ఆధార్‌లో ఉన్న విధంగా బ్యాంకులోని రుణఖాతాలో పేరు లేకపోవడంతో మాఫీ కాలేదని అధికారులు వెల్లడించారు.

- చిన్న చిన్న కారణాలతో పథకానికి దూరమవుతున్న రైతులు
- ఆధార్, రుణఖాతాపై అక్షరదోషాలతో జాబితాలో పేరు గల్లంతు

మోర్తాడ్: అర్హులందరికీ రుణమాఫీ అందడం లేదు. చిన్న కారణాలతో అనేక మంది మాఫీకి దూరం అవుతున్నారు. అర్హత ఉన్నా.. జాబితాలో పేరు లేకపోవడంతో అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని ప్రభుత్వం వెల్లడించినా కుటుంబ నిర్ధారణ జరగని కారణంగా రేషన్ కార్డులో పేర్లు లేనివారికి, కార్డులు లేని వారికి రుణమాఫీ చేయలేదు. అలాగే ఆధార్ కార్డులో ఉన్న విధంగా బ్యాంకు ఖాతాలో పేరు లేకపోయిన జాబితాలో పేరు ఉండటం లేదు. ఆధార్, బ్యాంకు ఖాతాలో పేర్లలో అక్షర దోషం ఉన్నా మాఫీ చేయడం లేదు. జిల్లాలో తొలి విడతలో 44,469 మందికి రూ.225 కోట్లు, రెండో విడతలో 22,868 మందికి రూ.210 కోట్ల మాఫీ జరిగింది.

మళ్లీ నిధులు కేటాయిస్తారా?

రుణం మాఫీ కాని వారి కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అయితే లోపాలు సవరించడానికి సరైన మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో రుణం మాఫీకి తాము ఎప్పుడు అర్హత పొందుతామో అని రైతులు ప్రశ్నిస్తున్నారు. చిన్న తప్పులు, రేషన్ కార్డులో పేరు లేకపోవడంతో మాఫీ చేయడం లేదంటే.. ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వం చేస్తోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణం మాఫీ చేయగా అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించారు. మాఫీ జరగని వారి నుంచి ఫిర్యాదులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నా.. అవి పరిష్కారం అయ్యాక నిధులను ఎలా విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలనే డిమాండ్ వినిపిస్తుంది. ప్రభుత్వం మాఫీ పొందని రైతుల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించి రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మిగుల్చుకోడానికే..



ఆధార్, బ్యాంకు రుణ ఖాతాలో పేర్లు తప్పుగా ఉండటం, అక్షర దోషాలను సాకుగా చూపి రుణమాఫీ చేయకపోవడం సరైంది కాదు. రైతు వివరాలు సరిగా ఉన్నాయా లేవా అని చూడాలి. ప్రభుత్వం నిధులను మిగుల్చుకోవడానికే చిన్న చిన్న కారణాలను సాకుగా చూపిస్తుంది. – దేగాం రాములు, రైతు, అంక్సాపూర్

భూసేకరణపై అభ్యంతరాలు తెలపండి

కమ్మర్‌పల్లి: జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు భూసేకరణపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ పేర్కొన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి రైతు వేదికలో భూములు కోల్పోతున్న రైతులతో అవార్డ్ ఎంక్వైరి నిర్వహించారు. కమ్మర్‌పల్లి గ్రామ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే(బైపాస్ రోడ్డు) నిర్మాణం కోసం 140 మంది రైతులకు చెందిన సుమారు 60.08 ఎకరాల భూమి సేకరించడానికి నోటిఫికేషన్ వెలువడినట్లు ఆయన తెలిపారు. భూసేకరణ చట్టం ప్రకారం భూ క్రయ విక్రయాల సరాసరి ప్రకారం ధర నిర్ణయం చేస్తామన్నారు. బేసిక్ విలువ, మార్కెట్ విలువ, ఎక్కువ, తక్కువ తదితర అంశాలను పరిగనలోకి తీసుకొని ధర నిర్ణయం అవుతుందన్నారు. రైతులు ఎంతమేరకు పరిహారం కోరుతున్నారో తెలియజేయాని



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

కోరారు. ఆర్ఐ శరత్‌కుమార్ సర్వే నంబర్ వారిగా రైతుల వివరాలు, కోల్పోతున్న భూమి వివరాలను చదివి వినిపించారు. బాధిత రైతులు మాట్లాడుతూ హైవే పై ఎకరానికి రూ.2 కోట్లు, లోపలి భూములకు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు, భీమ్‌గల్ రోడ్డులో రూ.1.20 కోట్లు పరిహారం అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం సరిపోకపోతే సివిల్ కోర్టును ఆశ్రయించి పరిష్కరించుకోవచ్చని అధికారులు సూచించారు. అనంతరం రైతులకు నోటీసులు అందజేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలపై కన్ను!

- చైర్‌పర్సన్ పీఠం కోసం ఆశావహుల ప్రయత్నాలు
- జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు

ఆర్మూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ పీఠం కోసం ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి, కోటగిరి, వేల్పూర్‌తో పాటు కిసాన్‌నగర్‌లో సబ్ యార్డు ఉన్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు ఎంపిక చేసిన వ్యక్తికే ఈ పదవి వచ్చే అవకాశాలు ఉండటంతో ఆశావహులు వారిని ప్రసన్నం చేసుకోవడంలో బిజీగా ఉన్నారు. ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం గతంలో బీసీ జనరల్‌కు రిజర్వు కావడంతో ఈ స్థానం కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఇట్టెం జీవన్ జిల్లాలోని ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. వీరు ఇద్దరు ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు.



సాయిబాబాగౌడ్



ఇట్టెం జీవన్

రిజర్వేషన్లపై స్పష్టత కరువు

అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వాటిని భర్తీ చేసే క్రమంలో తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మార్కె ట్ కమిటీ చైర్మన్‌ల రిజర్వేషన్లను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక తొలగిస్తుందా అనే విషయమై స్పష్టత రాలేదు. జిల్లాలోని ఏడు మార్కెట్ యార్డులకు చైర్‌పర్సన్‌లతో పాటు పాలకవర్గాన్ని నామినేటెడ్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 2016లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌ల నియామకాల్లో రిజర్వేషన్ అమలు చేసింది. బీఆర్‌ఎస్ నాయకులను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పీఠాలకు నామినేట్ చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న చైర్‌పర్సన్‌లు రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుంటూ తమ పదవీ కాలాన్ని విడతల వారిగా పెంచుకుంటూ వచ్చారు. రాష్ట్రంలో అధికార మార్పు అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో వీరు పదవులు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో కాంగ్రెస్‌లోని ఆశావహులు చైర్‌పర్సన్ కుర్చీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

రెచ్చిపోతున్న సైబర్ దొంగలు

- మీ పిల్లలను కిడ్నాప్ చేశామంటూ ఫోన్లు
- బాల్కొండ ఠాణాకు తరలివచ్చిన బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

బాల్కొండ: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కొత్త కొత్త రూపాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. రోజు రోజుకు ఎక్కువ అవుతున్న సైబర్ నేరగాళ్ల ఫోన్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త నంబర్ నుంచి వచ్చిన ఫోన్ ఎత్తాలంటే భయపడుతున్నారు. ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన ఓ వ్యక్తికి బుధవారం సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి నీ కుమారుడు మా స్నేహితుడి చెల్లికి అసభ్యకర మెసేజ్‌లు చేస్తున్నాడు.. కావాలంటే నీకు వాట్సాప్ చేస్తున్న చదువు అంటూ మెసేజ్ పంపాడు. తాము కేసు పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటు బెదిరించాడు.. కానీ సదరు వ్యక్తి సైబర్ నేరగాళ్ల మోసాన్ని పసిగట్టి మెసేజ్ ఓపెన్ చేయకుండా వారు చెప్పిన మాటలను నమ్మకుండా స్థానిక పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించారు. అంతేకాకుండా బాల్కొండ మండలం నాగాపూర్, జలాల్‌పూర్, బోదేపల్లి, మండల కేంద్రానికి చెందిన నలుగురికి ఒకే రకమైన పోలీస్ అధికారి డీపీ ఉన్న వాట్సాప్ నుంచి బుధవారం కాల్ వచ్చింది. ఫోన్ లిఫ్ట్ చేసిన బాధితులకు సైబర్‌నేరగాళ్లు మీ పిల్లలను స్కూల్, కాలేజీల వద్ద కిడ్నాప్ చేశాం.. అడిగినంత డబ్బు ఇవ్వండి లేదంటే వారు మీకు దక్కరంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆందోళనకు గురైన బాధితులు వెంటనే బాల్కొండ పీఎస్‌కు తరలివచ్చి పోలీసులకు విషయాన్ని వివరించారు.

ఎవరూ స్పందించొద్దు

పోలీసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ వచ్చే ఫోన్ కాల్స్‌కు ఎవరూ స్పందించొద్దు. సైబర్‌నేరగాళ్లు కొత్త మార్గంలో ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి. ఎవరూ సైబర్‌నేరగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దు. రుణమాఫీకి సంబంధించిన ఓటీపీలు చెప్పాలంటు వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ నమ్మొద్దు. బెదిరింపులు, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. – యాసర్ అరాఫత్, బాల్కొండ ఎస్సై

మంచం పట్టిన ఎల్లమ్మకుంట

- చికున్‌గున్యాతో బాధపడుతున్న తండావాసులు?
- జ్వరం, కీళ్లనొప్పులతో అవస్థలు

మోపాల్: మోపాల్ మండలంలోని ఎల్లమ్మకుంట గ్రామానికి చెందిన గిరిజనులు 45 రోజులుగా జ్వరం, చికున్‌గున్యా వ్యాధితో మంచం పట్టారు. వృద్ధులు, యువకులు అనే తేడా లేకుండా కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. నడవలేని పరిస్థితుల్లో మంచానికే పరిమితమయ్యారు. స్థానిక పీఎంపీ, ఆర్‌ఎంపీలను సంప్రదించి, మందులు వాడుతున్నారు. మరికొందరు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రులు, పీహెచ్‌సీ చుట్టూ తిరుగుతున్నారు. గతంలో రెండు సార్లు ముదక్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేసినా జ్వరం, కీళ్ల నొప్పులు అదుపులోకి రాలేదని తండావాసులు వాపోతున్నారు. ఎల్లమ్మకుంట గ్రామంలో 150 కుటుంబాలు, 500 జనాభా ఉంది. సుమారు 45 రోజులుగా జ్వరం, కీళ్ల నొప్పులు, వంటి ఆరోగ్య సమస్యలు దాదాపు అన్ని కుటుంబాలను వెంటాడుతున్నాయి. నేటికీ 50 మంది వరకు జ్వరం, చికున్‌గున్యాతో బాధపడుతున్నారు. నడవ లేకుండా, ఏం తినకుండా మంచం బారిన పడ్డారు. పలువురు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.





జ్వరంతో బాధపడుతున్న గేనిబాయి, బదావత్ సంతోష్

ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినా..

ఎల్లమ్మకుంటలో ముదక్‌పల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గతంలో రెండు సార్లు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు. అప్పట్లో కొంత అదుపులోకి వచ్చినా.. మళ్లీ జ్వరాలు విజృంభించాయి. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరినీ జ్వరం వెంటాడుతోంది. ఒకరి తర్వాత మరొకరు మంచం పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య సమస్య అంతగా లేకపోయినప్పటికీ.. తాగునీటి క్లోరినేషన్, దోమల కోసం ఫాగింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

నాలుగు రోజులుగా బాధపడుతున్నా..

నాలుగు రోజులుగా జ్వరం, కీళ్ల నొప్పులు ఉన్నాయి. నడవడానికి రావడం లేదు. ఆర్‌ఎంపీ వద్ద మందులు తీసుకుని వేసుకున్నాను. అయినా ఫలితం లేదు. వ్యవసాయ పనులు వదిలేసి పడుకుంటున్నా. – గేనిబాయి, ఎల్లమ్మకుంట

ఇంట్లో అందరికీ కీళ్లనొప్పులు

ఇంట్లో 20 రోజులుగా ఒకరి తర్వాత మరొకరికి జ్వరం, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. మొన్నటివరకు నా భార్య పద్మ కీళ్లనొప్పులతో బాధపడింది. మూడ్రోజులుగా నేను కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. మా అమ్మకు కూడా ఇదే పరిస్థితి. – బదావత్ సంతోష్, ఎల్లమ్మకుంట

45 రోజులుగా తగ్గడం లేదు



నాకు నెలన్నర క్రితం జ్వరం, కీళ్ల నొప్పులు వచ్చాయి. ఆస్పత్రిలో చూపించుకుంటే 20 రోజులకు కొంతనయం అయింది. కానీ పూర్తిగా తగ్గలేదు. ఇప్పుడు కూడా మంచిప్పలోని ఆర్‌ఎంపీ వద్దకు వెళ్తున్నా. ఎవరూ పట్టించుకునే వారు లేరు. – రతన్, ఎల్లమ్మకుంట

చికున్‌గున్యా అని నిర్ధారించలేం

జిల్లాలో చికున్‌గున్యా కేసులు నమోదు కాలేదు. కీళ్ల నొప్పులు వచ్చినంత మాత్రానా చికున్‌గున్యా అని నిర్ధారించలేం. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గురువారం ఎల్లమ్మకుంటలో క్యాంపు ఏర్పాటుచేసి పరీక్షిస్తాం. – తుకారాంరాథోడ్, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 8 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10, ఆవిరి రూపంలో 423, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు)అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1076.60(36.32 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీలకు అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కో–ఆర్డినేటర్ రంజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం స్టడీ సెంటర్‌లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శుక్రవారం ఉద్యోగ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె లక్ష్మణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు ముత్తూట్ గ్రూప్, ధరణి ఇన్‌ఫ్రో హైదరాబాద్ కంపెనీవారు ప్రొబిషనరీ ఆఫీసర్, ఇంటర్న్‌షిప్ ట్రైనీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటోలతో నిరుద్యోగులు హాజరు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శివాజీనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి నిర్వహించే మేళాలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 9581768413, 9948748428, 6305743423, 9959456793 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



ఖలీల్‌వాడి: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన జాన్కంపేట్ సీటీసీ ఎస్సై ఎ దేవ్‌రావ్, పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్సై డి మహేందర్, ఎస్. గ్యాన్ సింగ్, ఐదవ టౌన్ ఏఎస్సై ఎం సత్యనందంకు సీపీ బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. పోలీస్ విధి నిర్వహణలో ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బి. కోటేశ్వరరావు, ఏవో శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి అడవి పందుల గుంపులు



లింగంపేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జనావాసాల్లోకి అడవి పందులు రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా, తహసీల్ కార్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహాల పరిసరాల్లో ప్రతీ రోజు అడవి పందులు గుంపులుగా వచ్చి సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసరాల్లో, రోడ్ల పక్కన చికెన్ వ్యర్థాలు వేస్తుండడంతో అడవి పందులు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అడవి పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐకేపీలో బదిలీలు అయ్యేనా!

- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- నిరాశలో సెర్ప్ ఉద్యోగులు

డొంకేశ్వర్: ప్రభుత్వ శాఖల్లో దాదాపు ఉద్యోగ బదిలీలు పూర్తయ్యాయి. కానీ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో మాత్రం ఐకేపీ ఉద్యోగుల ప్రక్రియ ఇంత వరకు కొలిక్కి రాలేదు. పదేళ్ల నుంచి బదిలీలు లేకపోవడంతో అందరికీ స్థానచలనం కలిగించాలని ప్రభుత్వాన్ని కోరడంతో ఈ శాఖలో బదిలీలు ప్రారంభం కాలేదు. సంఘ నేతలు కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇటు బదిలీలకు విధించిన గడువు బుధవారంతో ముగిసింది. దీంతో బదిలీలు ఉంటాయో లేదో తెలియక ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తమకు మినహాయింపు ఇచ్చి బదిలీలకు అవకాశం ఇస్తుందని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఐకేపీలో జిల్లా వ్యాప్తంగా డీపీఎంలు, ఏపీఎంలు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది 215 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి పదేళ్లుగా బదిలీలు జరగలేదు. దీంతో ఒకేచోట ఎక్కువ ఏళ్లు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిబంధనల ప్రకారం మూడేళ్లు నిండిన వారికి స్థానచలనం కల్పించాలి.

గత ప్రభుత్వం వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా బదిలీలు



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం

చేపట్టలేదు. ఒకే సీటులో ఎక్కువ కాలం పని చేయడంతో చాలా మందికి విసుగొచ్చింది. కొంతమంది ఉద్యోగులు అవినీతి చేసేందుకు అవకాశం ఏర్పడింది. దూరప్రాంతాల్లో పని చేస్తున్న వారైతే విధులకు వచ్చి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బదిలీలు లేక గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలనలో, పనిలో నూతనుత్తేజం లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వం బదిలీలు చేపట్టడంతో స్థానచలనం కోసం ఉవ్విళ్లూరారు. అయితే 40 శాతం ఉద్యోగులకే బదిలీలు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. 40 శాతానికి బదులు నూరుశాతం బదిలీలకు అవకాశం కల్పించాలని, ఇలాగైతేనే అందరికీ స్థానచలనం లభిస్తుందని ఐకేపీ ఉద్యోగ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రెండు వారాలుగా ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

'ఉపాధి హామీ' ఉద్యోగులనూ కదిలించాలి

గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పని చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు కూడా సీట్లలో కదలకుండా పాతుకుపోయారు. జిల్లా వ్యాప్తంగా 22మంది ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు 68మంది, కంప్యూటర్ ఆపరేటర్లు 45మంది, ఆరుగురు ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. దీంతో ఉపాధిహామీలో అక్రమాలు జరుగుతున్నాయి. వీరికి బదిలీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. స్థానచలనం కోరుకుంటున్న ఉద్యోగులు కూడా ఉన్నారు.

ఐకేపీలో కేడర్ల వారీగా ఉద్యోగులు

డీపీఎంలు	06
ఏపీఎంలు	30
సీసీలు(ఎల్-2)	97
సీసీలు(ఎల్-1)	18
ఎంఎస్ సీసీలు	54
ఇతర సిబ్బంది	10

డీఎస్ సేవలు మరువలేనివి

ఖలీల్‌వాడి: ధర్మపురి శ్రీనివాస్ సేవలు మరువలేనివని, మున్నూరుకాపుల ఐక్యతకు కృషి చేశారని నగర మున్నూరు కాపు సంఘం ప్రతినిధి దారం సాయిలు అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో డీఎస్ సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సంస్మరణ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. డీఎస్‌తోనే మున్నూరు కాపులకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. దీంతోపాటు న్యాల్‌కల్ రోడ్డులో మున్నూరుకాపు కల్యాణ మండపానికి రెండెకరాల స్థలం ఇచ్చి నిధులు కేటాయించారని పేర్కొన్నారు. 1989లో ఎమ్మెల్యేగా డీఎస్ గెలుపునకు మున్నూరుకాపులు ఏకమైనట్లు తెలిపారు. నగరంలోని మున్నూరుకాపు సంఘాలతో పాటు ఇతర కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయించారన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా ప్రస్థానం ప్రారంభించిన డీఎస్ రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగా పని చేశారని,



డీఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మున్నూరు కాపు ప్రతినిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో డీఎస్ పాత్ర కీలకమన్నారు. నిజామాబాద్‌ను నగరపాలక సంస్థగా మార్చి రోడ్లు, డ్రైనేజీని ఏర్పాటు చేశారని, నగర ప్రజలకు మంచినీటి కోసం అలీసాగర్ నుంచి మంచినీటిని తీసుకొచ్చి దాహార్తిని తీర్చారన్నారు. నగరంలోని 21 సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చారని అన్నారు. డీఎస్ మున్నూరుకాపుల గుండెలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

దేశ భక్తి పెంపొందించడమే లక్ష్యం

మాక్లూర్: యువతలో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యంగా యువ కళోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానందం పేర్కొన్నారు. బుధవారం గుత్ప గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి యువకళోత్సవం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా డ్యాన్స్ అసోసియేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న గుత్పలో యువ కళోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి ఆనంద్‌బాబు, కార్యదర్శి టి సతీశ్, సాయిబాబు, వినయ్‌కుమార్, టి ప్రశాంత్, అంకుష్, రఘు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిత్యానందం

పీజీ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో బుధవారం 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్ 6,8,7,9,10వ సెమిస్టర్, పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జరుగుతు న్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలో 206 మందికి 186 మంది హాజరు కాగా 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం తెయూ మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షల్లో 5గురికి 5గురు విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

న్యాయ కళాశాలలో మూట్‌కోర్టు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు నమూనా మూట్ కోర్టుపై బుధవారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రామాగౌడ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు కోర్టుల్లో నిర్వహించే సంఘర్షణ, వాజ్యముల విచారణ గురించి పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి కె.ప్రసన్నరాణి, బీవోఎస్ చైర్మన్ జెట్లింగ్ ఎల్లోసా, అధ్యాపకులు నాగజ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

గోదావరిలో దూకి వివాహిత ..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ధర్మపురి కాలనీకి చెందిన తుమ్మల లక్ష్మి(32) అనే వివాహిత బాసరలోని గోదావరి నదిలో బుధవారం దూకి ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ నుంచి తల్లిగారి ఇంటికి నవీపేట్‌కు వెళ్లినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. అక్కడి నుంచి బాసర వెళ్లి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తుమ్మల లక్ష్మి మృతదేహం

చెరువులో దూకి..

ధర్పల్లి: మండలంలోని రామడుగుకు చెందిన దుమాల కవిత (43) బుధవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుమాల లక్ష్మణ్ భార్య కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



కవిత మృతదేహం

అనారోగ్యంతో..

బోధన్‌రూరల్: అనారోగ్యానికి గురైన ఓ మహిళ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది నీటి కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగం గ్రామానికి చెందిన షేక్ షమీమ్(44)కు కొన్నేళ్ల నుంచి ఆరోగ్యం బాగుండడం లేదు. ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో నాటి నుంచి తాను చనిపోతానని కుటుంబ సభ్యులతో చెప్పేది. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన షమీమ్ తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించగా నీటి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. భర్త షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన నగరంలోని బోర్గాం కాలువలో బుధవారం చోటు చేసుకుంది. నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన సాయికుమార్(21) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బోర్గాం వద్ద కల్లు దుకాణంలో కల్లు తాగి వెళ్తుండగా మద్యం మత్తులో కాలువలో జారిపడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన బస్సు



బాల్కొండ: నిజామాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మెండోరా మండలం పోచంపాడ్ వద్ద జాతీయ రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘనటనలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్సు పోచంపాడ్ వద్దకు రాగానే రహదారి పై పశువులు అడ్డుగా రావడంతో పశువులను తప్పించబోయి బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిందన్నారు. ఆ సమయంలో బస్సులో 72 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.అనంతరం ప్రయాణికులను వేరే ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానానికి తరలించారు. మెండోరా,హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు.

బస్సు, బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు

లింగంపేట: బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని గాంధీనగర్ శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి లింగంపేట మండలం పొల్కంపేటకు వెళ్తున్న బైక్ గాంధీనగర్ శివారులో ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న చాకలి భూమయ్య, చాకలి నరేందర్, విద్యార్థిని చాకలి సంహితకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్సులో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఘటన స్థలిలో క్షతగాత్రులు

భీమ్‌గల్‌లో దొంగతనం



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి దొంగతనం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బోయిగల్లీకి చెందిన కోతల శ్రీనివాస్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. కుటుంబీకులు ఓ గదిలో గాఢ నిద్రలో ఉండగా మరో గదిలో ఉన్న 3.5 తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండిని అపహరించినట్లు పేర్కొన్నారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంధపు చెట్టు దొంగతనం



తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గంధపు చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దొంగలించినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో కొనేళ్లుగా ఉన్న గంధం చెట్టును ఈనెల 29న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చెట్టును నరికేశారన్నారు. చెట్టుకొమ్మలు, కాండం వదిలేసి మొద్దులను ఎత్తుకెళ్లారన్నారు. వాటి విలువ సుమారు రూ. 80వేల నుంచి రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు లేని చోట చెట్టును నరికేశారన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

కప్పలవాగుకు జలకళ



పారుతున్న కప్పలవాగు

సిరికొండ: మండలంలోని మెజార్టీ గ్రామాలకు జలప్రదాయనిగా ఉన్న కప్పలవాగు ఎట్టకేలకు జలకళ సంతరించుకుంది. మంగళవారం రాత్రి తూంపల్లి, కొండాపూర్ గ్రామాల్లోని అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి కప్పలవాగు పొంగిపొర్లింది. కప్పలవాగు పారడంతో తూంపల్లి, కొండాపూర్, గడ్కోల్, తాళ్లరామడుగు, కొండూర్, పెద్దవాల్గోట్, చిన్నవాల్గోట్, పోత్నూర్ గ్రామాల పరిధిలో భూగర్భజలాలు పెంపొందనున్నాయి. కప్పలవాగు పారడంతో వర్షంపై ఆధారపడి నాట్లు వేసిన రైతులు వానకాలం పంట పండినట్లేనని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు..

సిరికొండ/ధర్పల్లి: సిరికొండ మండలంలోని గడ్కోల్ వద్ద కప్పలవాగుపై భారీ వంతెన నిర్మిస్తుండటంతో రాకపోకల కోసం పక్క నుంచి వాగులో తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు వేశారు. కానీ మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కప్పలవాగు పొంగి ప్రవహించడంతో అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గ్రామం నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి చెందిన చాలా మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు వాగు అవతల ఉన్నాయి. పొలాల వద్దకు వెళ్లడానికి కూడా రోడ్డు తెగిపోవడంతో ఇబ్బందులు నెలకొన్నాయి. ధర్పల్లి మండలం వాడి వాగుపై నిర్మిస్తున్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు సైతం తెగిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం వైపు వెళ్లాలంటే సిరికొండ, కొండూర్, ధర్పల్లి, ప్రాజెక్టు రామడుగు, డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి వద్ద గల జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది.



గడ్కోల్ వద్ద కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు



వాడి వాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

బడ్జెట్‌తో ప్రజల జీవితాలపై ప్రభావం

తెయూ(డిచ్‌పల్లి): ఆర్థిక వ్యవస్థను ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాల్లో బడ్జెట్ ప్రధానమైందని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం తెయూ కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ గోపిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓపెన్‌హౌస్ ఆన్ యూనియన్ అండ్ స్టేట్ బడ్జెట్–2024పై చర్చ' కార్యక్రమానికి రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు, సామాజిక న్యాయం, ధరల స్థిరత్వం, అంతర్జాతీయ చెల్లింపుల సమతుల్యతలు బడ్జెట్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయన్నారు. కేంద్ర బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యానికి రోడ్ మ్యాప్‌లాగా ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ప్రొఫెసర్లు రాంబాబు, కె అపర్ణ, ఖైసర్ మహమ్మద్, అధ్యాపకులు సీహెచ్ ఆంజనేయులు, సంపత్ కుమార్, పున్నయ్య, శ్రీనివాస్, దత్తహరి, గంగాధర్, శ్వేత, సరిత, కిరణ్‌రాథోడ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

రాష్ట్ర బడ్జెట్‌లో తెయూకు అన్యాయం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బడ్జెట్ నిధుల కేటాయింపులో తెయూకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీకాంత్ విమర్శించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద ప్లకార్డులతో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రం పేరిట ఉన్న ఏకైక యూనివర్సిటీ తెలంగాణ యూనివర్సిటీ అని అన్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యూనివర్సిటీ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించక పోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జగడం సాయి, తరుణ్, సంజయ్, శ్రీకాంత్, రియాజ్, అజారుద్దీన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్(కామారెడ్డి), ఎస్ఆర్ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్(ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 6 గురికి 5గురు హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

బాధితుడికి పరిహారం చెల్లించాలి

- ఒకరిని గాయపర్చిన కేసులో కోర్టు తీర్పు

బోధన్: వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కేసులో బాధితుడికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని, కట్టలేని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని బోధన్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి దేవన్ అజయ్ కుమార్ బుధవారం తీర్పు ఇచ్చారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శంకర్ తెలిపిన ప్రకారం.. 2023 నవంబర్ 11న పొతంగల్ మండలంలోని కారేగాంలో ఎర్రోళ్ల సునీత ఇంటి ఎదుట ఆమె కుమారులు సాత్విక్, సిద్ధు ఎదురింటి రమేశ్ పిల్లలు లోకేశ్, కార్తీక్‌లు కలిసి కొట్టుకుంటుడగా అక్కడికి వచ్చిన సునీత భర్త యాదవరావు ఎందుకు కొట్టుకుంటున్నారని అడిగాడు. అదే సమయంలో రమేశ్ భార్య క్రాంతి వచ్చి యాదవరావును అసభ్య పదజాలంతో దూషించగా ఆయన అక్కడి నుంచి వెళ్లి గ్రామంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు వెళ్లాడు. విషయం తెలిసి క్రాంతి భర్త రమేశ్ ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొని యాదవరావుపై దాడి చేశాడు. దాడిలో యాదవరావు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో కోటగిరి పీఎస్‌లో సునీత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై సందీప్ రమేశ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసు సాక్షుల తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వాదించారు. విచారణలో బాధితుడికి పరిహారం చెల్లించాలని జడ్జి తీర్పు వెల్లడించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- పంచ లోహ విగ్రహం, మూడు బైక్‌లు స్వాధీనం

కామారెడ్డి క్రైం: జిల్లాతో పాటు మేడ్చల్, రాజన్న సిరిసిల్లా, నిజామాబాద్ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడిన నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పీఎస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో పీఎస్ పరిధిలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న చిల్ల గంగాదాస్‌ను పట్టుకొని విచారించగా అతని నుంచి లక్ష్మీనృసింహ స్వామి పంచలోహ విగ్రహం, మూడు బైక్‌లతో పాటు రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంగదాసు పాత నేరస్తుడేనని, ఒకరిని హత్య చేసి జైలుకి వెళ్లి వచ్చినట్లు పేర్కొన్నారు. మేడ్చల్‌లో ఓ బైక్, గంభీరావుపేట, మాక్లూర్, గాంధారి, కామారెడ్డి పీఎస్ పరిధిల్లో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇతనికి సహాయపడుతున్న ఇద్దరు ప్రస్తుతం జైలులో ఉన్నట్లు పేర్కొన్నారు. వారిని విడిపించడానికి అవసరమైన డబ్బుల కోసమే నిందితుడు దొంగతనాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

ఆలయాల్లో దొంగల బీభత్సం

ఎడపల్లి: మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం తెల్లవారు జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయాల్లో ఉన్న హుండీ తాళాలను పగులగొట్టి నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. బాపునగర్‌లోని సాయిబాబా, ఏఆర్పీ క్యాంప్‌లోని రామాలయంలో దొంగలు హుండీలను పగులగొట్టి అందులో ఉన్న నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. ఆలయ అర్చకుల ఫిర్యాదు మేరకు పోలీసులను ఆలయాలను పరిశీలించి వివరాలు సేకరించారు.